సాక్షి
కాకినాడ

మంగళవారం । 31 । జనవరి । 2023

ఎస్‌పీఎల్.. ఆట మొదలు..

SAKSHI PREMIER LEAGUE


ఔత్సాహిక క్రీడాకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. 8లో..



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దొండ పాటి వెంకట రామకృష్ణ (రాజమహేంద్రవరం) సోమవారం రూ.1.01.116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఇద్దరికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల్లో ఇద్దరికి సోమవారం కారుణ్య నియామకం కింద జూనియర్ సహాయకులుగా నియమించారు. కలెక్టర్ కృతికా శుక్లా ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరంతరం కరోనా టెస్టులు



గొల్లప్రోలు పీహెచ్‌సీలో వ్యాక్సిన్లు తనిఖీ చేస్తున్న జిల్లా ఇమ్యునేషన్ అధికారి ప్రభాకరరావు

పిఠాపురం: జిల్లా పరిధిలో కొన్ని రోజులుగా ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదని జిల్లా ఇమ్యునేషన్ అధికారి ఐ ప్రభాకరరావు తెలిపారు. ఆయన సోమవారం గొల్లప్రోలు, చేబ్రోలు పీహెచ్‌సీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలోను, గ్రామ, వార్డు సచివాలయాల్లోను కరోనా టెస్ట్ కిట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

రోజూ జిల్లాలో ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో టెస్టులు చేస్తున్నామన్నారు. ర్యాండమ్ పద్ధతిలో అనుమానం ఉన్న వారికి ఈ పరీక్షలు చేస్తున్నామన్నారు. పాజిటివ్ వస్తే వెంటనే ల్యాబ్‌కు పంపి కొత్త వేరియంట్‌లు ఏమైనా ఉన్నాయనే విషయంపై మరింత లోతుగా పరిశీలిస్తున్నామన్నారు. అన్ని రకాల వ్యాక్సిన్లు ప్రభుత్వ ఆస్పత్రులలోను సిద్ధంగా ఉంచామన్నారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ డాక్టర్ శ్యామల తదితరులున్నారు. గొల్లప్రోలు, చేబ్రోలు పీహెచ్‌సీలను పరిశీలించి వ్యాక్సిన్లపై ఆరా తీశారు.

జీవన ప్రమాణాల పెంపునకు జగనన్న చేదోడు

- జగనన్న చేదోడు కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం జమ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 13,314 మందికి పథకం కింద లబ్ధి



జగనన్న చేదోడు మెగా చెక్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

జగనన్న చేదోడుతో వెలుగులు



టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న నాకు జగనన్న చేదోడు పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు మా జీవితంలో వెలుగులు నింపుతున్నాయి. ఇద్దరు పిల్లల్ని చదివించుకుంటున్నాం. మాలాంటి వారి కష్టాలను గుర్తించి చేదోడు వంటి పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

జి సత్యతులసి భవాని,
గొడారిగుంట, కాకినాడ.



కాకినాడ సిటీ: జగనన్న చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలని ఎంపీ వంగా గీత ఆకాంక్షించారు. సోమవారం పల్నాడు జిల్లా వినుకొండలో జగనన్న చేదోడు పథకం కింద రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తిలతో కలసి ఎంపీ పాల్గొని లబ్ధిదారుల నుద్దేశించి మాట్లాడారు. వివక్షకు తావులేకుండా పేదల జీవన ప్రమాణాలు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద మూడో విడతలో జిల్లాలో 13,314 మంది దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులకు రూ.10 వేలు చొప్పున రూ.13.31 కోట్లు అందజేసిందన్నారు. ఈమొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. వృత్తిపనివార్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పారదర్శకంగా, జవాబుదారీ తనంతోలబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. గడచిన రెండేళ్లలో 12,207 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 23.98 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. అర్హులై ఉండి ఏకారణం చేతనైనా లబ్ధి అందని వారికి కూడా మరో అవకాశం కల్పిస్తూ ఏటా జూన్, డిసెంబర్‌లలో ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.



సంక్షేమ పథకలతో ఆత్మస్థైర్యం



చాలా ఏళ్ల నుంచి టైలరింగ్‌పై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వారి అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలతో ఆత్మస్థైర్యం కలుగుతోంది. టైలరింగ్‌కు అవసరమైన సామగ్రి కొనుక్కునేందుకు పథకం సొమ్ము ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

సిహెచ్ లోవకుమారి,
మధురానగర్, కాకినాడ.

రైతన్నకు యాంత్రీకరణ దన్ను

- జిల్లాలో రైతులకు 118 ట్రాక్టర్లు పంపిణీ
- రైతుల ఖాతాలో రూ.3.38 కోట్ల సబ్సిడీ
- మరో 80 ట్రాక్టర్ల పంపిణీకి చర్యలు
- ప్రతీ మండలానికి సబ్సిడీ యంత్రాలు
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న వ్యవసాయశాఖ



కరప మండలం గురజానాపల్లిలో సబ్సిడీపై ట్రాక్టర్‌ను అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఆరుగాలం శ్రమించి పండించే రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విత్తనాలు మొదలు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల వరకూ చేదోడు వాదోడుగా ఉంటోంది. అవసరమైన అన్ని రకాల సేవలను రైతు భరోసా కేంద్రాలు ద్వారా సమకూర్చుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో రైతులు విత్తనాలు..ఎరువుల కోసం సమీపంలోని పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలకు లోనుకావల్సి వచ్చేది. ఏదో బాధ పడి కొనుగోలు చేసినా నకిలీల బెడద వెంటాడి నష్టాల పాల్జేసేది. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక రైతులకు ఈ కష్టాలు తప్పాయి. జిల్లాలో అత్యధికంగా రైతులు వరి పండిస్తారు. సహజంగానే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే ఈ జిల్లాలో కూలీల కొరతతో ఏటా రైతాంగం సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు ఈ విషయంలో పెద్ద మేలు చేసింది.

ఆర్బీకేలో దరఖాస్తు చేస్తే చాలు

ఆర్‌బీకేల ద్వారా యంత్రపరికరాలను రైతులకు అందుబాటులో ఉంచుతోంది. గ్రూపులుగా ఏర్పడిన రైతులకు తొలిదశలో 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లను అందజేసింది. తద్వారా సాగులో ఖర్చు తగ్గించి ప్రయోజనం చేకూర్చింది. వారి సేద్యానికి భరోసా కల్పించింది. టీడీపీ హయాంలో సిఫారసులు ఉన్న వారికే ఈ సబ్సిడీ యంత్రాలు అందించేవారు. నాయకులు సిఫారసు లేఖ ఉన్న వారికే జన్మభూమి కమిటీలు యంత్రాలు మంజూరు చేసేవి. బినామీల పేరుతో టీడీపీ నాయకులే ఈ సబ్సిడీ యంత్రాలు కొట్టేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా చేసుకుని సబ్సిడీ యంత్రాలను మంజూరు చేస్తున్నారు. సంబంధిత ఆర్‌బీకే పరిధిలో రైతులు యంత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే చాలు. మిగిలిన ప్రక్రియ సిబ్బంది చూసుకుంటున్నారు. ఎటువంటి సిఫారసులు లేకుండానే యంత్రాలు అందుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకూ 118 ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్ విలువ సుమారు రూ.6లక్షల నుంచి రూ.9 లక్షలు ఉంటుంది. రైతులకు ఇప్పటి వరకూ రూ 3.38 కోట్లు సబ్సిడీ కింద రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సీజన్‌లో అర్హులైన వారు ఇప్పటికే ఆర్‌బీకేలో 80మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి త్వరలో ట్రాక్టర్లు పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతీ మండలానికి డ్రోన్‌లు పంపిణీ



మందులు పిచికారి చేసేందుకు ప్రస్తుతం డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు వీటిని కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. డ్రోన్లను 40 శాతం సబ్సిడీపై రైతులకు అందించనుంది. పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రైతులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారి చేస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు.

అర్హత ఉంటే యంత్ర పరికరాలు



వ్యక్తిగత వ్యవసాయ యంత్ర పరికరాలతోపాటు గ్రూపులుగా ఏర్పాటైన వారికి వ్యవసాయ కోత యంత్రాలు, ట్రాక్టర్లు అందిస్తాం. దరఖాస్తులు అన్ని పరిశీలించి అర్హత ఉంటే ఆయా గ్రూపు సభ్యులతో చర్చించి ట్రాక్టర్లు అందిస్తున్నాం.

ఎస్ విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ

స్పందనకు 251 అర్జీలు



ప్రజల సమస్యలను వింటూ అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: స్పందన కార్యక్రమానికి సోమవారం 251 అర్జీలు వచ్చాయి. వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్పందనకు ఈమెతోపాటు అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, కెఎస్‌ఈజెడ్ ఎస్‌డీసీ కె మనోరమ, ఎస్సీ కార్పొరేషన్‌ఈడీ డీఎస్ సునీత పాల్గొని అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీల పరిష్కార నివేదికకు..సమస్య ఫొటోలను తప్పనిసరిగా జత చేయాలని అధికారులను ఆదేశించారు.

గాంధీ మార్గం అనుసరణీయం

కలెక్టర్ కృతికా శుక్లా



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: మహాత్ముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా యువతకు సూచించారు గాంధీ వర్ధంతి సందర్భంగా కాకినాడ గాంధీ భవన్‌లో సోమవారం గాంధీ విగ్రహానికి కలెక్టర్ నూలు దండ వేసి నివాళులర్పించారు. అనంతరం హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వివిధ పోటీలను ఆమె ప్రారంభించారు. వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, దేశభక్తి గీతాల పోటీల్లో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరికీ భోజన సదుపాయం, విజేతలకు బహుమతులు సమకూర్చిన సత్యాస్కాన్స్ అధినేత డాక్టర్ కాద వెంకటరమణను కలెక్టర్ అభినందించారు. పోటీల్లో విజేతలకు ఓఎన్జీసీ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ డి.మాలిక్, మేనేజర్ శంకర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అల్లూరి సురేంద్ర, వాస సత్యనారాయణ, ప్రొఫెసర్ ఇళ్ల దోసగిరిరావు, పాలెపు రవి వ్యవహరించారు. పలు అంశాలను గాంధీభవన్ కార్యదర్శి వైఎస్‌వీఎస్ మూర్తి వివరించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి గాంధీతత్వం ప్రచారం చేసిన గాంధీభవన్ కార్యవర్గానికి డాక్టర్ కాదా వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. పైడా వెంకటనారాయణ, పైడా వెంకటేశ్వరరావు, పైడా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

- వచ్చే నెల 6 వరకూ ఉత్సవాలు
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



కుంతీమాధవ స్వామివారి ఉత్సవ మూర్తులను కల్యాణోత్సవాలకు సిద్ధం చేస్తున్న అర్చకులు

పిఠాపురం: దేశంలోనే పేరుగాంచిన పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన స్థానిక కుంతీమాధవస్వామి కల్యాణోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 6 వరకూ కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి రోజు ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించి పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

1న దివ్య కల్యాణం

ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శ్రీచక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, ధ్వజారోహణం, 31న ఉదయం 9 గంటలకు అలంకార తిరుమంజనం కల్యాణాలంకారం, వచ్చే నెల 1న ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సాయంత్రం 4 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించనున్నారు. 2న శేష, గరుడ వాహనాలపై గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 3న పొన్నవాహనంపై గ్రామోత్సవం, 4న తేదీ రాత్రి 10 గంటలకు రథోత్సవం, 5న ఉప్పాడ సముద్రతీరంలో స్వామివారి చక్రస్నానం, 6న స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, శ్రీపుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

రూ. 25 కోట్లతో రైల్వే స్టేషన్ల అభివృద్ధి

ఎంపీ వంగా గీత వెల్లడి



కాకినాడ: జిల్లా పరిధిలోని రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం రైల్వేశాఖ సుమారు రూ.25 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ వంగా గీత చెప్పారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సామర్లకోట స్టేషన్‌లో రెండవ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.21కోట్లు మంజూరు చేశారన్నారు. తుని రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం రూ. 2.35 కోట్లు మంజూరైందన్నారు. మేడపాడు రైల్వేస్టేషన్‌లో నాణ్యమైన ప్లాట్‌ఫాం నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు, మేడపాడు స్టేషన్ల ప్లాట్‌ఫారాలలో షెల్టర్ల నిర్మాణానికి రూ.2.49 కోట్లు మంజూరయ్యాయన్నారు. చేబ్రోలు, దువ్వాడ స్టేషన్ల మధ్య రైల్వే నీటి సరఫరా వ్యవస్థ నిర్మాణం, ఆర్వో ప్లాంట్ల కోసం రూ.2.32 కోట్లు కేటాయించారన్నారు. అనకాపల్లి-తుని స్టేషన్‌లో నేషనల్ గ్రీన్‌కోర్, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు అనుగుణంగా మురికినీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.1.18లక్షలు మంజూరయ్యాయన్నారు. సామర్లకోట రైల్వే సబ్ డివిజన్ పరిధిలో దివ్యాంగుల కోసం సౌకర్యాలు, పార్కింగ్, ర్యాంప్, తాగునీరు, టాయ్‌లెట్లు వంటి సౌకర్యాలు, హమాలీలకు ఓపెన్ షెడ్లు, ఇతర సదుపాయాలకు రూ. 11 కోట్లు మంజూరయ్యాయన్నారు. కాకినాడ, పిఠాపురం, గొల్లప్రోలు, దుర్గాడ, అన్నవరం స్టేషన్లలో పలు అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. పిఠాపురం-ఉప్పాడ జంక్షన్ వద్ద ఆర్వోబీ నిర్మాణానికి రైల్వేశాఖ నుంచి రూ.45 కోట్లు మంజూరయ్యాయన్నారు. గోర్స-మాధవపురం-తుని-హంసవరం రైల్వేగేట్ల వద్ద ఆర్వోబీల కోసం రూ. 17కోట్లు మంజూరైనట్లు ఎంపీ చెప్పారు.

ఇల వైకుంఠపురంలా..

సఖినేటిపల్లి: సర్వజగద్రక్షకుడైన ఆ ఆది దేవుడు వెలసిన అంతర్వేది పుణ్యక్షేత్రం.. ఇల వైకుంఠపురంలా భాసిల్లుతోంది. సకల శుభాలూ కటాక్షించే శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవానికి ఈ దివ్య ధామం ముస్తాబైంది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా దశమి మంగళవారం రాత్రి 12.46 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవంతో పాటు ఆ మర్నాడు.. అంటే బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు భీష్మ ఏకాదశి పర్వదినాన జరిగే స్వామివారి రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చేశారు.



అభయ ముద్రతో శ్రీలక్ష్మీనృసింహస్వామి

హెల్ప్‌లైన్ నంబర్లు

టూరిజం కమాండ్ కంట్రోల్:	08862 – 21500
పోలీసు :	100
సఖినేటిపల్లి ఎస్సై :	94407 96566
రాజోలు సీఐ :	94407 96526
తహసీల్దార్ :	98499 03893
వీఆర్‌ఓ :	97018 35669
ఎంపీడీఓ :	89787 92099
కార్యదర్శి :	80740 18776
డాక్టర్ యూనస్ :	83286 58482
మెడికల్ ఆఫీసర్ :	87922 57516
స్వామి :	77802 35621
సారథి :	94403 42192
పాపారావు :	91774 90400
రాజోలు ఆర్టీసీ ఎంక్వైరీ :	08862 – 221057
రాజోలు ఆర్టీసీ డీఎం :	99592 25538
రాజోలు ఎక్సైజ్ :	97047 79056

భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

అంతర్వేది బీచ్, సాగర సంగమం వంటి అత్యంత కీలక ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీలు వై.మాధవరెడ్డి, కేవీ రమణ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ స్థాయిల్లో 1,500 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. ఆరుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 100 మంది ఎస్సైలు, 1,200 మంది కానిస్టేబుల్స్, మరి కొంత మంది హోంగార్డులు ఈ విధులు నిర్వహిస్తారు. బీచ్ వద్ద భక్తుల రక్షణకు మత్స్యశాఖ ఆధ్వర్యాన గజ ఈతగాళ్లను, స్పీడ్ బోట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఫ్లడ్‌లైట్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు.

శివసదన్ సత్రంలో మరిన్ని వసతులు

దేవస్థానం పాలక వర్గం నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి, ఏసీ రమేష్ బాబు తదితరులు

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలోని సత్యగిరిపై రూ.16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నశివసదన్‌లో ఏసీలు, గీజర్ల ఏర్పాటుకు దాఖలైన టెండర్లను దేవస్థానం పాలకవర్గం ఆమోదించింది. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు. ఈ సత్రంలోని 138 గదులలో 1.5 టన్ను కెపాసిటీ గల ఏసీలు ఏర్పాటవుతాయి. ప్రతి గదిలో 15 లీటర్ల గీజర్ ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపారు. సమావేశంలో దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి, ఏసీ రమేష్ బాబు, ఇంజినీరింగ్ అధికారులు ఏఈఓలు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.

ఇతర అంశాలు

- దేవస్థానం దత్తత గ్రామం కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరశింహస్వామివారి దేవస్థానంలో మార్చి2 నుంచి 8వతేదీ వరకు వార్షిక కల్యాణమహోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రూ.18 లక్షల వ్యయంతో అభివృద్ధి, విద్యుద్దీకరణ, పెయింటింగ్ పనులకు చేపట్టనున్నారు.
- పలు సత్రాలలో కాలపరిమితి పూర్తయినందున వాటి స్థానంలో కొత్త ఏసీలు ఏర్పాటు చేసేందుకు రూ.11.95 లక్షలు వెచ్చించనున్నారు.
- హరిహరసదన్ సత్రంలో వాహనాల పార్కింగ్ కోసం చదును చేసిన స్థలంలో హైమాస్ట్ దీపాలకు అవసరమైన స్తంభాలు, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుకు రూ.11.66 లక్షల టెండరుకు ఆమోదం తెలిపారు.
- దేవస్థానంలోని వివిధ సత్రాలలోని గదుల అద్దె పెంచాలని వచ్చిన ప్రతిపాదనలపై సమావేశంలో చర్చ జరిగింది. వసతులు కల్పించకుండా అద్దె పెంచడం సమంజసం కాదన్న చైర్మన్ రోహిత్ అభిప్రాయంతో ఈఓ సత్యనారాయణ మూర్తి ఏకీభవించారు.

ఎస్‌పీఎల్.. ఆట మొదలు..

- ఘనంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం
- గైట్‌లో ప్రారంభించిన 'తూర్పు' జేసీ తేజ్‌భరత్
- కాకినాడలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు చేతుల మీదుగా శ్రీకారం
- 'సాక్షి'కి అధికారుల అభినందనలు


క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు. చిత్రంలో రిఫ్రెష్‌మెంట్స్ స్పాన్సరర్ హరీష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఔత్సాహిక క్రీడాకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలోను, రాజానగరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలోను ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కాకినాడలో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలను జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఏదేలా ఉన్నా క్రీడా స్ఫూర్తితో రాణించాలని అన్నారు. పోటీల రిఫ్రెష్‌మెంట్స్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రికెట్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకూ జరిగే ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ చార్లి, 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ తదితరులు

SAKSHI PREMIER LEAGUE

తొలి రోజు విజేతలు వీరే..

- తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. అజయ్ 19 పరుగులు చేశాడు. 108 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు 9 ఓవర్లలో 101 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. 7 పరుగుల తేడాతో కిట్స్ జట్టు విజయం సాధించింది.
- రెండో మ్యాచ్‌లో పీఆర్‌జీ కళాశాల జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. బ్యాట్స్‌మన్ పోలీస్ 32 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పీఆర్‌జీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 82 పరుగులు మాత్రమే చేసింది. 6 పరుగుల తేడాతో ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు విజయం సాధించింది.
- మూడో మ్యాచ్‌లో జేఎన్‌టీయూకే, ఐడియల్ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన ఐడియల్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన జేఎన్‌టీయూకే జట్టు 8 వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలో 102 పరుగులు చేసింది. చరణ్ 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఐడియల్ జట్టు 79 పరుగులు చేసి, 10 వికెట్లు కోల్పోయింది. 23 పరుగుల తేడాతో జేఎన్‌టీయూకే జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లను క్రికెట్ కోచ్ చార్లీ పర్యవేక్షించారు.


రెండో మ్యాచ్ విజేత సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు


మూడో మ్యాచ్ విజేత జేఎన్‌టీయూకే జట్టు

విద్యాభివృద్ధి ఒప్పందాలతో మేలు


ఎంఓయూ చేసుకుంటున్న వీసీ ప్రసాదరాజు, సిలికానాంధ్ర ప్రోవోస్ట్ రాజు చామర్తి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): దేశాల మధ్య విద్యాభివృద్ధి ఒప్పందాలతో ఆర్థిక ప్రగతి సాధ్యమని జేఎన్‌టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. జేఎన్‌టీయూకే ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యాన అమెరికా కాలిఫోర్నియా యూనివర్సిటీ సిలికానాంధ్ర, జేఎన్‌టీయూకే మధ్య సోమవారం ఎంఓయూ జరిగింది. దీని ద్వారా ఉమ్మడి ప్రాజెక్టులు, పరిశోధనలు, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్, స్టడీ టూర్స్, షార్ట్ కోర్సులకు పరిశ్రమల సహకారంతో జాయింట్ ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు వీలుంటుందని వివరించారు. రెక్టార్ రమణ, సిలికానాంధ్ర ప్రోవోస్ట్ రాజు చామర్తి, చైర్మన్ వేణుగోపాల్, మాజీ వీసీ అల్లం అప్పారావు, రిజిస్ట్రార్ సుమలత, ఇంక్యుబేషన్ సెంటర్ సలహాదారు జేవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


గైట్‌లో ఎస్‌పీఎల్ పోటీలను ప్రారంభిస్తున్న జేసీ తేజ్‌భరత్


మొదటి మ్యాచ్ విజేత మదర్స్ డిగ్రీ కళాశాల జట్టు

రాజానగరం: స్థానిక గైట్ కళాశాలలో జరుగుతున్న పోటీలను తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసికోల్లాసంతో పాటు మేధోసంపత్తి వృద్ధి చెందుతుందని అన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, విషెస్ చెప్పారు. అనంతరం పోటీలను ప్రారంభించి, బ్యాటింగ్, బౌలింగ్‌లో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించి, క్రీడాకారుల హర్షధ్వానాలు అందుకున్నారు. క్రీడలను, గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతున్న 'సాక్షి' మీడియా గ్రూప్‌కు అభినందనలు తెలిపారు. పోటీల గురించి 'సాక్షి' రీజినల్ మేనేజర్లు రమేష్‌రెడ్డి (అడ్మిన్), కొండలరావు (ప్రకటనల విభాగం) వివరించారు. నాకౌట్ పద్ధతిలో పది ఓవర్ల పరిమితితో జరిగే ఈ పోటీల్లో రోజుకు ఆరు మ్యాచ్‌లు జరగనున్నాయి. కార్యక్రమంలో యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ ఉమాశంకర్, గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం, గైట్ కళాశాల ప్రతినిధులు, 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు

- ప్రారంభ మ్యాచ్ మదర్స్ డిగ్రీ కళాశాల (కోటనందూరు), రైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన రైట్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మదర్స్ కళాశాల 10 ఓవర్లలో ప్రత్యర్థికి 97 పరుగుల లక్ష్యాన్నిచ్చింది. ఈ టీమ్‌లో సీహెచ్ సతీష్ 17 బంతులకు 4 ఫోర్లు కొట్టి, 24 పరుగులు తీశాడు. పి.లోవరాజు 16 బంతులకు 3 ఫోర్లతో 23 పరుగులు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన రైట్ కళాశాల జట్టు 45 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. 'మదర్స్' జట్టు విజేతగా నిలిచింది. బౌలింగ్‌లో రైట్ కళాశాలకు చెందిన ఎస్‌కే తోహా 2 ఓవర్లలో 20 పరుగులు మాత్రమే ఇచ్చి, మూడు వికెట్ల పడగొట్టాడు. ఎస్.నాగబాబు 23 పరుగులు ఇచ్చి, 2 వికెట్లు తీసుకున్నాడు.
- గైట్ కళాశాల జట్టుకు, రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో కళాశాల జట్టుకు మధ్య మరో పోటీ జరిగింది. టాస్ గెలిచిన అల్లు కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి, నిర్ణీత ఓవర్లలో 74 పరుగులు చేసింది. శివ 12, మోసి 15 చొప్పున పరుగులు చేశారు. బౌలింగ్‌లో గైట్ టీమ్‌లోని కిరణ్ 2 ఓవర్లకు 6 పరుగులు ఇచ్చి, మూడు వికెట్లు తీసుకుని కీలకంగా నిలిచాడు. మనోజ్ 2 వికెట్లు పడగొట్టాడు. తరువాత బ్యాటింగ్ చేసిన గైట్ కళాశాల జట్టు 8.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని సాధించి విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో రాకేష్ 13 బంతులకు 17 పరుగులు చేసి, నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ వరప్రసాద్ 11 బంతులకు 11 పరుగులు చేయడం విశేషం. ప్రత్యర్థి జట్టుకు చెందిన కిషోర్ బౌలింగ్‌లో 2 వికెట్లు తీసుకున్నా విజయం పొందలేకపోయారు.
- రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజానగరం దివ్య కళాశాల జట్ల మధ్య కూడా మరో పోటీ ఆసక్తికరంగా జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌కేవీటీ కళాశాల జట్టు 10 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసి, ప్రత్యర్థికి భారీ లక్ష్యం ఇచ్చింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దివ్య కళాశాల జట్టు 10 ఓవర్లలో 75 పరుగులు మాత్రమే చేసి, 53 పరుగుల తేడాతో ఓటమి పాందింది. విజయం సాధించిన ఎస్‌కేవీటీ కళాశాల జట్టులో ఎస్.రాజకుమార్ 35 బంతులకు 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 17 ఫోర్లు (ఒకే ఓవర్‌లో ఆరు బంతులకు ఆరు ఫోర్లు), ఒక సిక్స్ కొట్టి టీమ్ విజయానికి విజయానికి తోడ్పడ్డాడు. వర నాని 3 ఫోర్లు కొట్టి 22 పరుగులు చేశాడు.
- ఈ పోటీలకు అంపైర్లుగా కె.అంజనీకుమార్, కె.దినేష్‌కుమార్, స్కోరర్‌గా జి.రవితేజ వ్యవహరించారు.


రెండో మ్యాచ్ విజేత గైట్ కళాశాల జట్టు


బౌలింగ్‌లో ఆకట్టుకున్న జేసీ తేజ్‌భరత్


మూడో మ్యాచ్ విజేత ఎస్‌కేవీటీ కళాశాల జట్టు

సీనియర్ నేషనల్స్ వాలీబాల్ రిఫరీగా జార్జి



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అస్సాం రాష్ట్రం గౌహతిలో వచ్చే నెల 2 నుంచి 9 వరకూ జరిగే సీనియర్ పురుషులు, మహిళల జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు రిఫరీగా రాష్ట్ర వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎల్.జార్జి నియమితులయ్యారు. ఈ మేరకు పోటీల నిర్వాహకుల నుంచి సోమవారం నియామక పత్రాలు అందుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

రాత్రి కూడా నిత్యాన్నదానం

- డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో భక్తుల విజ్ఞప్తి
- కమిషనర్ ఆదేశాల మేరకే చర్యలు
- అన్నవరం దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో రాత్రి వేళ కూడా భక్తులకు ఉచిత భోజనం లేదా ఫలహారం ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్వీ సత్యనారాయణమూర్తి సోమవారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగతాయారు (అవిడి), కృష్ణవేణి (బూరుగుపూడి) పైవిధంగా కోరారు. దీనిపై ఈఓ సత్యనారాయణమూర్తి స్పందిస్తూ రాత్రి వేళ బస చేసేవారు తక్కువగా ఉంటారని చెప్పారు. పగటి వేళ సాయంత్రం 4 గంటల వరకూ కూడా భోజనం పెడుతున్నామని తెలిపారు. అయితే భక్తుల కోరికను దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తామని, వారి అనుమతి మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్రతాల్లో ఇస్తున్న జాకెట్టు ముక్క చిన్నదిగా ఉందని, వ్రత గావంచా మీద బియ్యం తక్కువ వేస్తున్నారని బిక్కిన విశ్వేశ్వరరావు (కాకినాడ) చెప్పారు. గతంలో సత్యదేవుని శాశ్వత కల్యాణ పథకానికి రూ.8 వేలు చెల్లించానని, ప్రస్తుతం తన పేరిట కల్యాణం జరుగుతున్నట్టు తనకు సమాచారం రావడం లేదని ఇమ్మడిశెట్టి రామకృష్ణ (రాజానగరం) తెలిపారు. శాశ్వత పథకాల పరిమితిని పదేళ్లకు మార్చామని ఈఓ తెలిపారు. బాండ్ తెస్తే పరిశీలించి, పూర్తి వివరాలు తెలియజేస్తానని చెప్పారు. రత్నగిరిపై భక్తులకు రాత్రి వేళ కూడా ప్రథమ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని వీరేంద్ర (తుని) కోరారు. ఉత్తరాది భక్తుల కోసం రత్నగిరిపై హిందీలో బోర్డులు ఏర్పాటు చేయాలని కృష్ణబాబు (పెద్దనాపల్లి), రైల్వేస్టేషన్ రోడ్డులో దేవస్థానం మైకులు ఏర్పాటు చేసి, భక్తి గీతాలు ప్రసారం చేయాలని కృష్ణ (అద్దరిపేట) కోరారు. ఇంకా పలువురు భక్తులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, ఏఈఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హంస వాహనంపై అరుదెంచిన స్వామి

- రాత్రి శేష వాహన సేవ
- మూడో రోజూ కన్నుల పండువగా గ్రామోత్సవాలు


హంస వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: పాలనురుగులాంటి తెల్లని హంస వాహనంపై అరుదెంచిన స్వామివారిని కన్నులారా వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం సాయంత్రం హంస వాహనంపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. అలాగే రాత్రి శేష వాహనంపై కూడా స్వామివారి గ్రామోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

వాస్తుపూజ, అంకురార్పణ

కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చక స్వాములు విశేష కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామివారి సన్నిధిలో పుణ్యాహవాచనం, వాస్తుపూజ, గరుత్మంతుని హోమం, అంకురార్పణ, గరుత్మంతుని చిత్రపటం ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు చేశారు.

ఏడు రోజుల పాటు విష్ణుదీక్ష

ఉత్సవాల నిర్వహణకు అర్చకులు మంగళవారం నుంచి పౌర్ణమి వరకూ ఏడు రోజుల పాటు విష్ణుదీక్ష తీసుకున్నారు. ఏటా ఈ దీక్ష చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అర్చకులకు దీక్షావస్త్రాలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ అందజేశారు. దీక్ష తీసుకున్న అర్చకులు భక్తిశ్రద్ధలతో అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించారు. నవధాన్యాలను పుట్టమట్టిపై చల్లి, సర్వ దేవతలనూ ఆవాహన చేసి, ఏడు రోజుల పాటు అర్చనకు శ్రీకారం చుట్టారు. ఈ నవధాన్యాల నుంచి మొక్కలు ఎంత ఏపుగా ఎదిగితే అంత మేర గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉంటాయని చెబుతారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలకు సకల దేవతలనూ గరుత్మంతుని ద్వారా ఆహ్వానిస్తూ ధ్వజస్తంభంపై ధ్వజపటం ఎగుర వేయడమే ధ్వజారోహణ అని ప్రధానార్చకుడు శ్రీనివాస్ కిరణ్ తెలిపారు. కల్యాణ మహోత్సవాలకు దుష్టశక్తుల వల్ల ఎటువంటి అవరోధాలూ లేకుండా ఉండేందుకు కూడా ధ్వజారోహణ చేస్తామని చెప్పారు. ధ్వజస్తంభానికి మామిడాకులు, దర్భలు కట్టి, గరుత్మంతుని చిత్రం గీసిన వస్త్రాన్ని అర్చకులు ఎగురవేశారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.9 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి.భరద్వాజ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ వాకలపూడికి చెందిన కొవ్వూరి పద్దారెడ్డి వద్ద ప్రత్తిపాడుకు చెందిన మాదినే గంగాధరరావు వ్యాపార నిమిత్తం 2020లో రూ.11 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.9 లక్షల చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును పద్దారెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో గంగాధరరావుపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.



గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.